## క్లుప్తంగా

### బంగారు ఆభరణాల వితరణ



కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి బంగారు ఆభరణాలు అందజేస్తున్న దాతలు

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం సంజీవపురానికి చెందిన జయన్న, విజయలక్ష్మి దంపతులు పగడాలు, పులిగోరు బంగారు ఆభరణాలు వితరణ చేసినట్లు ప్రధాన అర్చకుడు రామాచార్యులు తెలిపారు. అర్చకుడుమాట్లాడుతూ స్వామికి రూ.2,08,500 లక్షల విలువ చేసే 2 తులాల 3 గ్రాముల బంగారు ఆభరణాలు అందజేశారన్నారు.అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు చేసి దంపతులను ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### అరియర్స్ చెల్లించాలి

గార్లదిన్నె: ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న అరియర్స్‌ను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న ఆరియర్స్ , 11వ పీఆర్సీ , సరెండర్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. అలాగే వచ్చే సంక్రాంతికి 12వ పీఆర్సీ కమిటీని ప్రకటించి వెంటనే ఐఆర్ ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులకు ఇస్తున్న వృత్యంతర శిక్షణ రెసిడెన్షియల్ పద్ధతిలో కాకుండా ఎమ్మార్సీలో ఇవ్వాలన్నారు. అపార్ ఐడీ జనరేషన్‌లో విద్యార్థుల ఆధార్ సమస్యలు గ్రామ సచివాలయంలోనే స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. అనంతరం ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, రామక్రిష్ణ, సాంబశివుడు, వెంకట చౌదరి తదితరులు పాల్గొన్నారు.

### పీర్ల చావిడికి రూ.50 వేల విరాళం



గ్రామస్తులకు నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: మండలంలోని సి.బండమీదపల్లి పీర్ల చావిడికి వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆలూరు సాంబశివారెడ్డి రూ. 50 వేలు విరాళమిచ్చారు. సి.బండమీదపల్లి గ్రామస్తులు పీర్ల చావిడి మరమ్మతులకు సాయం చేయాలని కోరడంతో ఆయన స్పందించి ఆర్థిక సహాయం చేశారు. గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

### నియామక ఉత్తర్వుల అందజేత



అంగన్‌వాడీ ఆయాలకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న సీడీపీఓ ధిల్లీశ్వరి

గుత్తి: గుత్తి ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు నూతనంగా ఎంపికైన ముగ్గురు హెల్పర్లకు గుత్తి ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం సీడీపీఓ ఢిల్లీశ్వరి, సూపర్ వైజర్ నాగేశ్వరి నియామక ఉత్తర్వులు అందజేశారు. గుత్తి ఆర్ఎస్ అంగన్‌వాడీ కేంద్రం హెల్పర్ (ఆయా)గా కె.వనిత, గుంతకల్లు అర్బన్‌లోని అంకాలమ్మ అంగన్‌వాడీ కేంద్రం హెల్పర్‌గా బి.ఉష, అమీన్‌పల్లి హెల్పర్‌గా పి. హసీనా బేగం ఎంపికయ్యారు. వారికి సీడీపీఓ ఆర్డర్ కాపీలు అందజేశారు. గత నెల 25న ఆయాల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహించిన సంగతి విదితమే.

### రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

గుత్తి: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన జ్యోత్స్న (8వ తరగతి), జ్యోతి లక్ష్మి (10వ తరగతి) రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఉషారాణి తెలిపారు. రెండు రోజుల క్రితం ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన సెలక్షన్స్‌లో ప్రతిభ చూపిన వారిని సెలెక్టర్లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 6, 7వ తేదీల్లో గుంటూరు జిల్లా నరసారావుపేటలో నిర్వహించే రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో జ్యోత్స్న, జ్యోతి లక్ష్మి పాల్గొంటారు. ఈ క్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో క్రీడాకారిణులను ప్రిన్సిపాల్‌తోపాటు పీడీలు సరోజ, శ్యామల, శకుంతల అభినందించారు.

# పత్తి రైతు చిత్తు

- తెగుళ్లతో తీవ్ర నష్టం
- ఆదుకోవాలని అన్నదాతల వేడుకోలు



లక్ష్మంపల్లి వద్ద తెగులు సోకిన పత్తి పంటను తొలగించిన దృశ్యం

తాడిపత్రి నియోజకవర్గంలో పత్తి సాగు ఇలా..

| మండలం | హెక్టార్లు |
|---|---|
| పెద్దవడుగూరు | 11,750 |
| యాడికి | 2,677 |
| తాడిపత్రి | 400 |
| పెద్దపప్పూరు | 350 |



తెగులు సోకడంతో రాలిన పత్తి కాయలు

పెద్దవడుగూరు: లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి పత్తి పంట సాగు చేసుకుంటే భారీ వర్షాల కారణంగా రైతులు ఆశలు నీరుగారి పోయాయి. 15 రోజులుగా కురిసిన వర్షాలకు తెగుళ్లు సోకి పంట పొలాలు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. మండలంలోని చింతలచెరువు, పెద్దవడుగూరు, చిత్రచేడు, ముప్పాలగుత్తి, బందార్లపల్లి, కాశేపల్లి, చిన్నవడుగూరు, దిమ్మగుడి, లక్ష్మంపల్లి తదితర గ్రామాల్లో పత్తి పంటను అధికంగా సాగు చేశారు. తీరా పంట చేతికి వచ్చే సమయంలో చేతికి అందకుండా పోయిందని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారుగా 11,750 హెక్టార్లల్లో పత్తి పంట సాగు చేయగా ప్రస్తుతం 600 ఎకరాల్లో పత్తి పంటకు ఎర్రాకు తెగులు, కాయకుళ్లు తెగులు సోకి నిట్ట నిలువుగా ఎండిపోయింది. ఇప్పటి వరకూ ఎకరాకు రూ.30 వేల దాకా ఖర్చు పెట్టామని రైతులు వాపోయారు. ఈ లెక్క ప్రకారం లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పంట కాలం మూడు నెలలయింది. తొలి పంట చేతికి వచ్చే సమయానికి ఎకరానికి మూడు నుంచి నాలుగు కింట్వాళ్ల పత్తి వస్తోందన్నారు. క్వింటాల్ ధర రూ.6 వేల వరకూ నడుస్తోందన్నారు. కనీసం పండిన పత్తి పీకుదాం అనుకుంటే.. వర్షానికి మెత్తబడి పోయిందన్నారు. ఈ సారి వర్షాలు కన్నీరు మిగిల్చాయని, పంటలు పండక పోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జి.కొత్తపల్లి, విరుపాపురం, కాశేపల్లి, పెద్దవడుగూరు గ్రామాల్లో వెనుకదునులో వేసిన పంట కనీసం పత్తి ముఖం చూడకుండానే తెగుళ్లతో నిట్టనిలువుగా ఎండిపోతున్నాయని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతుల కోరుకుంటున్నారు.

#### పెట్టుబడి కూడా వచ్చేలా లేదు



10 ఎకరాలు సొంత భూమి, మరో 10 ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేశా. ప్రస్తుతం ఎకరానికి అర క్వింటాల్ పత్తి కూడా రాలేదు. అప్పులు తీరక పోతే రైతులకు ఆత్మహత్యలే శరణ్యం. పెట్టిన పెట్టుబడి కూడా రాకపోవడంతో రెండు ఎకరాల పత్తి పంటను తొలగించా.
– రంగారెడ్డి, రైతు, లక్ష్మంపల్లి

#### పొలం వైపు చూడలేక పోతున్నా..



10 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి పంటను సాగు చేశాను. ఎక్కువగా వర్షం రావడంతో పొలంలో నీరు ఎక్కువగా ఉంది. దీంతో పత్తి మొక్కలకు కాయకుళ్లు తెగులు సోకింది. పంటకు ఏమి క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలో కూడా తెలియడం లేదు.
– ముత్యాలరెడ్డి, రైతు, కాశేపల్లి

#### రైతులకు సూచనలు ఇస్తున్నాం



తెగుళ్ల నివారణపై గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇటీవల కురిసిన వర్షానికి దెబ్బ తిన్న పంటల వివరాలను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. పంట నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం.
– మల్లీశ్వరి, ఏఓ, పెద్దవడుగూరు

## సాగునీటి పథకాలకు నిధులివ్వాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

గుంతకల్లు రూరల్: జిల్లాలో సాగునీటి పథకాల అభివృద్ధి కోసం రాష్ట్ర బడ్జెట్లో రూ.7 వేల కోట్ల నిధులు కేటాయించేలా కృషి చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు మంగళవారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు ఆయన నివాసంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి బీ.శ్రీనివాసులు మాట్లాడుతూ తుంగభద్ర ఎగువ కాలువ ఆధునీకీకరణ పనులు పూర్తి చేయడానికి సుమారు రూ.500 కోట్లు అవసరమవుతుందని, తుంగభద్ర డ్యాంకు కొత్తగేట్లు ఏర్పాటు చేయడానికి రూ.2100 కోట్లు అవసరం అవుతుందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేశారన్నారన్నారు. అదేవిధంగా హంద్రీనీవా పంట కాలువల నిర్మాణానికి రూ.1200 కోట్లు, కాలువ సామర్థ్యాన్ని పదివేల క్యూసెక్కులకు పెంచడానికి రూ.2,000 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. రాగులపాడు లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి చెరువులు, కుంటలకు తాగు, సాగు నీరు అందించేందుకు కూడా నిధుల అవసరం ఉందన్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌లో రూ.7 వేల కోట్ల కేటాయించేలా కృషి చేయాలని కోరారు.

## భక్తులకు సౌకర్యాలు మెరుగుపర్చండి



ఆలయ ఈఓ కే వాణికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని కోరుతూ ఆలయ పర్యవేక్షణ, సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం ఈఓ కె.వాణికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆలయ పర్యవేక్షణ సమితి కన్వీనర్ శ్రీనాథ్‌గౌడ్, కో కన్వీనర్లు కందుకూరి కృపాకర్, సోమశేఖర్, భాస్కర్ రంగయ్య, పూల రమణ, అరుణాచల నరసింహులు, రాము రాయల్ తదితరులు మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య, స్వామి ఆదాయం రోజురోజుకూ పెరుగుతున్నా.. ఆలయ అభివృద్ధిని పట్టించుకోవడం లేదన్నారు. వసతి గదుల్లో సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆలయంలో అవినీతికి అంతులేకుండా పోతుందని, సిబ్బంది, అర్చకులకు స్వామిపై ఉన్న భక్తి కంటే ఆదాయంపై ఆసక్తి పెరిగిందన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు ఆలయ పరిసరాలు అడ్డాగా మారాయన్నారు. అనంతరం ఆలయ నిర్వహణలో భాగంగా నిర్వహించే టెండర్లలో రాజకీయ జోక్యం లేకుండా, అవినీతికి చోటు లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

## సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి



పెద్దవడుగూరు మండలం చిట్టూరులో మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిషోర్‌రెడ్డి



గుత్తి మండలం తురకపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు



పామిడి మండలం గజరాంపల్లిలో పత్తి పొలాలను పరిశీలిస్తున్న ఏడీఏ, శాస్త్రవేత్త

పెద్దవడుగూరు: సమగ్ర సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త కిషోర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని చిట్టూరు గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు సస్య రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పత్తి పంటలో ప్రస్తుతం ఆకులు ముడుతలు పడి కణువుల మధ్య దూరం పెరుగుతుందన్నారు. సహజసిద్ధంగా లోపం కలిగిన నేలల్లో 2 గ్రాములు జింకు సల్ఫేట్ లీటర్ నీటికి కలిపి రెండు, లేదా మూడు సార్లు 5 రోజులకు ఒక సారి పిచికారీ చేయాలన్నారు. క్లోరోఫైరిఫాస్ వాడటం వలన కలిగే లాభాలను వివరించారు. అనంతరం పత్తి పంటలో అధిక దిగుబడులు సాధించడానికి తీసుకోవాల్సిన మెలకువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిలయన్స్ పౌండేషన్ జిల్లా ప్రతినిధి గిరిబాబు , రైతులు పాల్గొన్నారు.

#### తురకపల్లిలో 'పొలం పిలుస్తోంది'..

గుత్తి: మండలంలోని తురకపల్లిలో వ్యవసాయ, ఉద్యాన వన, పశుసంవర్ధక శాఖల అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా యాజమాన్య పద్ధతులు, భూసార పరీక్షల ప్రాముఖ్యత, ఎరువులు, ఉద్యాన వన పంటల సాగు, పెట్టుబడులు గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ముస్తాక్ అహ్మద్, ఉద్యాన శాఖ అధికారిణి మిత్రవింద మాధవి, వెటర్నరీ డాక్టర్ ప్రదీప్‌కుమార్, వీఏఏలు మానస, జగదీష్, రైతులు పాల్గొన్నారు.

#### పత్తి పంటల పరిశీలన

పామిడి: మండలంలోని గజరాంపల్లి సమీపంలో పత్తి పంట పొలాలను మంగళవారం గుత్తి ఏడీఏ వెంకటరాముడు, ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మణ్ పరిశీలించారు. ఈసందర్భంగా వారు పత్తి పంటకు గులాబీరంగు పురుగు ఉధృతంగా ఆశించడాన్ని గమనించి, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. పత్తి సాగుచేసిన రైతులంతా ఈ నెల 15 లోపు ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలన్నారు. క్వింటాల్ రూ.7521గా ప్రభుత్వం నిర్ణయించిన ధరను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే వారు పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పాళ్యంతండా, పాళ్యం, కత్రిమల, అప్పాజీపేట గ్రామాల్లో వరిలో విత్తనోత్పత్తి కార్యక్రమంపై రైతులతో సమావేశమై మాట్లాడారు. సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ డీ లీనా వసుంధర, డీఆర్‌సీ ఏడీఏ శైలజా, సైంటిస్టు భార్గవి, ఐటీసీ ఏఓ శ్రీనివాస్, ఏఈఓ లు శ్రీనివాస్‌రావ్, ప్రసాద్, వీహెచ్‌ఏ సాయిప్రసన్న, ఎంపీఈఓ రాధ, రామాంజనేయులు, రైతులు హనుమంతరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, రాముడునాయక్, పరమేశ్వరప్ప, రామాంజనేయులు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఎస్ఆర్ఐటీ కళాశాల దాతృత్వం



ప్రిన్సిపాల్‌కు సామగ్రిని అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం దాతృత్వం చాటుకుంది. వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలోని సోషల్ రెస్పాన్సిబిలిటీ సెల్ ఆధ్వర్యంలో కొర్రపాడులోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలకు రూ.80 వేల విలువ చేసే బీరువాలు, బల్లలు, మైకు, ఆప్లిఫైర్, కుర్చీలు, ఎమర్జెన్సీ లైట్లు, వాటర్ క్యాన్లు అందజేశామన్నారు. పేద విద్యార్థులకు చేయూతను అందించుటలో ఎస్ఆర్ఐటీ కళాశాల యాజమాన్యం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, పబ్లిక్ రిలేషనల్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు డాక్టర్ హేమంత్‌కుమార్ యాదవ్, డాక్టర్ నాగ జయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చిన్న పుల్లయ్య, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

## 104 సిబ్బంది సమస్యలు పరిష్కరించండి



యల్లనూరు వైద్యుడు లోకేష్‌కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న 104 సిబ్బంది

బుక్కరాయసముద్రం: 104 సిబ్బంది సమస్యలు వెంటనే పరిష్కరించాలని 104 యూనియన్ నాయకుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో డాక్టర్ స్వాతి లక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 104 సిబ్బంది ఉద్యోగులపై చిన్న చూపు చూస్తోందన్నారు. మూడు నెలలుగా జీతాలు చెల్లించలేదన్నారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈఓలకు జీఓ నెంబర్–7 ద్వారా వేతనాలు ఇవ్వాలన్నారు. 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాలన్నారు. డీఎస్సీ ద్వారా నియమితులైన సీనియర్ డ్రైవర్లను కాంట్రాక్టు జాబితాలో పెట్టాలన్నారు. ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మహబూబ్ పీరా, నాగరాజు పాల్గొన్నారు.

గార్లదిన్నె: పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని 104 ఉద్యోగులు డిమాండ్ చేశారు. మంగళవారం ఉద్యోగులు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ద్వారా 104 సర్వీసులు నిర్వహించాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రంను పీహెచ్‌సీ డాక్టర్ గౌతమికి అంద జేశారు. కార్యక్రమంలో డీఈఓ గోపాల్ నాయక్, పైలెట్ కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు: డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 104 సిబ్బంది యల్లనూరు, తిమ్మంపల్లి వైద్యులకు లోకేష్‌కుమార్, కీర్తనకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో 104 జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, డిఈవో రవికుమార్, డ్రైవరు గంగయ్య పాల్గొన్నారు.

### వ్యక్తి బైండోవర్

పామిడి: పట్టణంలోని వీకే ఆదినారాయణరెడ్డి కాలనీకి చెందిన బట్టి సూరిని పోలీసులు మంగళవారం బైండోవర్ చేశారు. స్థానిక వెంగమనాయుడు కాలనీకి చెందిన పశువుల వ్యాపారి, నీలూరువాసి నూర్ బాషాపై బట్టి సూరి బెదిరింపులకు పాల్పడడంతో అతను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటికే బట్టి సూరిపై పోలీస్‌స్టేషన్‌లో పలు దౌర్జన్య, దాడులకు సంబంధించి కేసులుండడంతో.. అతడిని సీఐ యుగంధర్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. దీంతో సీఐతో సూరి వాగ్వాదానికి దిగాడు. దీంతో పోలీసులు బట్టి సూరికి కౌన్సెలింగ్ ఇచ్చారు. బైండోవర్ కేసు నమోదు చేసి, సొంత పూచీకత్తుపై వదిలేశారు.

## కలెక్టరేట్ ముట్టడి జయప్రదం చేయండి

గుత్తి: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ కోరారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వద్ద మంగళవారం ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు రూ. 14,00 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్నం భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దను, ఉమేష్ యాదవ్, రాజేష్, చరణ్, సుధాకర్, జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా మొత్తం కరువు ప్రాంతంగా ప్రకటించాలి

గుత్తి: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 63 అన్ని మండలాలనూ కరువు మండలాలుగా ప్రకటించి, రైతులను ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గుత్తిలో ఆయన మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు రామరంగారెడ్డి, గోపాల్ రెడ్డి, జ్ఞానేశ్వర్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం కేవలం కొన్ని మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలన్నారు. అంతే కాకుండా పంట నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు రూ. 50 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### ఎయిడ్స్‌పై అవగాహన

పామిడి: పట్టణ టీసీ హైస్కూల్‌లో హ్యాండ్స్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ రవి, కవిత మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా నివారించాలి అన్న అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాధిగ్రస్తులను అందరితో సమానంగా చూడాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కే రామ్‌కుమార్, ఎన్‌సీసీ యూనిట్ అధికారి రామాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### శ్మశాన వాటికకు రస్తా ఏర్పాటు చేయించండి

గుంతకల్లుటౌన్: స్థానిక పాతబస్టాండ్ ఎదురుగా ఉన్న ముస్లిం శ్మశానవాటికకు తూర్పు వైపు రస్తా ఏర్పాటు చేయించాలని మున్సిపల్ కమీషనర్ నయీమ్ అహ్మద్‌ను ముస్లిం ప్రజా హక్కుల పోరాట సమితి నాయకులు కోరారు. మంగళవారం కమిషనర్‌ను కలసిన మైనార్టీ నాయకులు రోడ్డు ఏర్పాటుకు అడ్డంగా ఉన్న ఆక్రమణలను తీసివేయించి త్వరితగతిన రస్తా వేయించాలన్నారు. అంతకుముందు చైర్‌పర్సన్ ఎన్.భవాని, కమిషనర్ నయీమ్ అహ్మద్, టీడీపీ నాయకుడు నారాయణస్వామిని మైనార్టీ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో లాయర్ ఆరీఫ్, పూల రసూల్, మాబు, వలి, అన్వర్, ముస్తాక్, మస్తాన్, పీరా తదితరులు పాల్గొన్నారు.

### పశుగ్రాసం సాగుకు దరఖాస్తు చేసుకోండి

శింగనమల: పాడి రైతులు పశుగ్రాసం సాగు కోసం ఉపాధి పథకం కింద దరఖాస్తు చేసుకోవాలని వెటర్నరీ ఏడీ పద్మనాభం సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పాడి పశువులతో పాటు, బోరు నీటి సదుపాయం ఉండాలన్నారు. చిన్న, సన్నకారు రైతులు అర్హులని, ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉండాలన్నారు. ఈ పథకం కింద పశుగ్రాసం సాగుకు రెండు సంవత్సరాల పాటు ఖర్చు భరిస్తామన్నారు. రైతులు దరఖాస్తులను రైతు సేవ కేంద్రం, అనిమల్ హస్బండ్రీ అసిస్టెంట్, పశు వైద్యశాలలో అందించాలన్నారు.

### నేడు గ్రామసభలు

యాడికి: ఉపాధి పనులు గుర్తించేందుకు ప్రతి పంచాయతీలో బుధవారం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీరరాజు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం యాడికికి కరువు మండలంగా ప్రకటించిందన్నారు. మండలంలోని 14 పంచాయతీల్లో ప్రజలు పనులు లేక వలసలు పోకుండా ఉండేందుకు ఉపాధి పనులు కల్పిస్తామన్నారు. పనులను గుర్తించేందుకు అన్ని పంచాయతీల్లో బుధవారం గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు.

బుక్కరాయసముద్రం: మండలంలోని పంచాయతీ కేంద్రాల్లో ఉపాధి పథకం కింద పనుల గుర్తించేందుకు సోమవారం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సాల్మాన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు ప్రజా ప్రతినిధులు హాజరై గ్రామసభలను విజయవంతం చేయాలన్నారు.

### మద్యం బాటిళ్ల సీజ్

యల్లనూరు: మండలంలోని కొడవండ్లపల్లికి చెందిన శివకేశవులు, వాసాపురం గ్రామానికి చెందిన సురేష్ నుంచి 97 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీరాం ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ పుట్లూరు సీఐ సత్యబాబు సమాచారం మేరకు కోడిమూర్తి చెరువు కట్ట వద్ద విక్రయించేందుకు మద్యం తీసుకెళ్లుతుండగా దాడి చేసి పట్టుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

### జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపిక



పవన్‌కుమార్

గుంతకల్లుటౌన్: గుజరాత్ రాష్ట్రంలోని బాంద్రా పట్టణంలో ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకూ నిర్వహించనున్న ఎన్ఎస్ఎస్ జాతీయ సమైక్యతా శిబిరానికి ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి యు.పవన్‌కుమార్ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మయ్య తెలిపారు. ఎస్కే యూనివర్సిటీ తరపున 10 మంది ఈ శిబిరంలో పాల్గొననున్నారని, అందులో తమ కళాశాల సెకిండియర్ బీఎస్సీ విద్యార్థి పవన్‌కుమార్‌కు అవకాశం లభించడం సంతోషదాయకమని ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ పీఓ నారాయణ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

### అక్రమాలను అరికట్టండి

పామిడి: మండలంలో అక్రమార్జనే ధ్యేయంగా పెట్టుకున్న అక్రమార్కులను అరికట్టాలంటూ బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గద్దల నాగభూషణం, రాప్తాడు, గుంతకల్లు నియోజకవర్గ అధ్యక్షుల ఓబులేసు, విజయ్, ప్రధాన కార్యదర్శి పీ ఆదినారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు బెస్త నారాయణమూర్తి ఆధ్వర్యంలో వారు తహసీల్దార్ శ్రీధరమూర్తికి వినతిపత్రం అందజేశారు. మండలంలో అక్రమ లేఅవుట్లు, రియల్ ఎస్టేట్ వెంచర్లపై అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం ముసుగులో భూ బకాసురులు లక్షల రూపాయలు గడిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు. పామిడి పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను ట్రిప్పర్లలో అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. అలాగే మండలంలోని ఖాదర్‌పేట, దేవరపల్లి, కాలాపురం, వంకరాజుకాలువ, సారకాయలపేట తదితర గ్రామాల్లోని కొండలను పిండిచేస్తూ గరుసును ట్రిప్పర్లలో తరలిస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూచిన పాపాన పోవడం లేదన్నారు. సహజసంపదలైన ఇసుక, గరుసు అక్రమ రవాణాను అరికట్టకపోతే ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.